# కుర్చీలాట

## పొలుడుసు వెంకటేశ్వరరావు

ప్రశాంతంగా వుద్యోగం చేసుకుంటున్న కోటేశ్రావు ఆ వూర్కి రావటాన్కి చాలా కష్టపడాల్సి వచ్చింది! అతను రాజమండ్రిలో రిలీవవటమే చాలా చిత్రంగా జరిగింది! ఎవరూ వూహించలేరు! కోటేశ్రావూ వూహించ లేదు! ఆ తర్వాత ఏలూరూ – గుంటూరూ– గుడివాడా! చిత్రంగా జరిగి పోయింది! కోటేశ్రావు అంతకుముందు చింతపల్లి అడవుల్లో వుంటుండేవాడు అట్లాంటి వాడి ఇంటికి వాళ్ళ భార్య తరపు బంధువు వకాయన ప్రకృతిని ఆనందించటాని కని వచ్చి నాలుగు రోజులుండి అతని భార్యకి కీ ఇచ్చి వెళ్ళాడు అప్పట్నుంచీ ప్రారంభమయినయి ప్రయత్నాలు!

అంతవరకూ తన ఉద్యోగ జీవితంలో నల్లమందు బాయిలాగా చట్టు విరిగిన నత్త లాగా ఎక్కడ వేస్తే అక్కడ పడివుండి కడుపులో చల్ల కదలకుండా కాలక్షేపం చేసుకుంటూ పోయే కోటేశ్రావుకి– అదిగో ఆక్షణం నుంచీ ప్రారంభ మయినయి కష్టాలు మనశ్శాంతి లేకుండా పోయింది

అమ్మాయ్! నువు నమ్మవు గానీ మన గుడివాడలో ఇదే వుద్యోగంలో వున్నాయన రెండు సంవత్సరాలు తిరగకుండానే సెంటర్లో వున్న మేడ కొనేసి అద్దెకివ్వటమే గాక వాళ్ళ వూళ్ళో పదెకరాల సుక్షేత్ర మయిన మాగాణి కొన్నాడని అనుకుంటున్నారు ఆ పయిన నగలూనాణ్యాలూ ఇంటి నిండా వస్తువులూ! ఏమని చెప్పేది!?

అదెలాగ బాబాయ్! అని ఆశ్చర్య పడింది జగదాంబ ఎలర్టవుతూ

ఇల్లా ఈ అడివిలో రాత్రింబగళ్ళు రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడా మనాడు! ఆ మధ్య ఒక మిత్రుడు అడిగాడు నన్ను మీవాడు ఏం సంపాయించాడయ్యా అని తెలీదన్నాను నిజంగా నాకు తెలీదుగదా! ఆ మాటకి మొహం తెల్లబడగా జగదాంబ, సంపాదనా నా మొహమా? అని నిట్టూర్పుగా–

ప్చ్! ఈ సారి కన పడినప్పుడు వాడు మళ్ళ అడుగుతాడు ఏం చెప్పేది నామొహం!? పైగా మీ దగ్గరకి వెళ్ళి వస్తున్నానని వాడికి చెప్పి వచ్చాను కూడాను నేను ఈ సారి తెలీదంటం కుదర్దు గదా! అతను మన పరువు తీస్తున్నాడు అని మొత్తుకున్నాడు లంబోదరం

పైగా– పై నుంచి క్రింద వరకూ హైద్రాబాదులో నాకు తెలీని వాళ్ళు లేరు! ఎన్ని వుండి ఏం ప్రయోజనం! మనాడు వుపయోగించు కోవాలి గద!

ఇప్పుడు ఏం చెయ్యాలో అదీ నువ్వే చెప్పు బాబాయ్! అంది శ్రద్ధగా

మనాడ్ని సెలవు పెట్టి రిలీవయి నా వెంట హైదరాబాదు రమ్మను కోరిన చోటికి వేయిస్తాను రెండు చేతులా సంపాదించవచ్చును! ఈ కాలంలో ఎవడయినా ఏం చూసి ఎవడి మొహమయినా చూస్తున్నాడూ!? ఆడపిల్లల్ను చూడు! రెపరెపా ఎదిగి వస్తున్నారా? ఎంత సేపులో వాళ్ళు పెరిగి నీ గుండెల మీద కూర్చుంటారూ పెళ్ళి పెళ్ళి – అనీ ఆ పెళ్ళిళ్ళు జరగాలంటే – రేపు ఎవడూ ఫలానా ఆఫీసరు గారి కూతుళ్ళు వీళ్ళని వూర్కే ఎవడు మాత్రం ముందుకొచ్చి పెళ్ళికి సరేనంటాడూ? ఆలోచించు ఏం పెట్టి ఆ కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేస్తావో?

నిజమే బాబాయ్! కాని ఆయన ప్రిన్సిపుల్సు అంటూ గోడెక్కి కూర్చుంటా నంటారే! ఎట్లా? బాధ పడి ముక్కు చీదుకుంది జగదాంబ

వెధవ ప్రిన్సిపుల్సూ గాడిద గుడ్డూ పాతికేళ్ళ నాడే మనాళ్ళు పాతి పెట్టేసారని బల్ల గుద్ది చెప్పు నేను మనూళ్ళో పదేనో తారీకు దాకా వుంటాను కావాలంటే కోటేశ్రావుని వచ్చి నన్ను కలవమని చెప్పు ఆ తర్వాత వ్యవహారం నేను చూసుకుంటాను భార్యా భర్తలు ఇద్దరూ మాట్లాడుకుని ఇదేం మనకి వద్దు అంతకీ ఆ దేవుడిదే భారం – అనుకుంటే వూరుకోండి కన్న తల్లిగా ఒక ఆఫీసరు గారి భార్య వయిన ఆడపిల్లల తల్లి వయిన నీకు – మన ప్రయత్నాలు మనం చెయ్యవలసిన అవసరం వుందన్న విషయం– అయిన వాడినిగా– తెలియనప్పుడు తెలియ చెప్పాల్సిన బాధ్యత నా మీద వుంది గనుక – ఇంత వరకూ చెప్పాను అపయిన నీఇష్టం! ఆ మీద భగవంతుడి చిత్తం అని చెప్పవలసిందంతా చెప్పి పై పంచ దులిపి బుజాన వేసుకుని వస్తానని చెప్పి వెళ్ళి పోయాడు లంబోదరం

ఆ రాత్రి క్లబ్బులో కొట్టుకుని కొట్టుకుని ఇల్లు చేరిన కోటేశ్రావుని నిలదీసింది జగదాంబ– అర్జంటుగా

మన బొంకు బాలెన్సెంత? అస్తి పాస్తుల వైనాలు ఏమిటి? వచ్చే జీతం ఎంత? మిగిలేది ఏమిటి? నాలుగయిదేళ్ళ తర్వాత మొదలు పెట్టి ముగ్గురు ఆడపిల్లలకీ వరసగా సంవత్సరానికొక పెళ్ళయినా చెయ్యాలి గనుక – అప్పటికి మిగిల్చిన సంపాదన – ఆ అవసరాల్ని తీరుస్తుందా? ఆ తర్వాత కుర్రవాడున్నాడు వాడికీ చదువు సంధ్యలు చెప్పించి ప్రయోజకుడ్ని చేసి పెళ్ళీ పెటాకులూ చేసి ఎంతోకొంత అందించాలి గదా! ఏమిటలా చూస్తారు?!

రమ్మిలో కవుంట్చిచ్చి దిగాలుగా ఇల్లు చేరిన కోటేశ్రావుకి ఆశ్చర్యం కల్గింది వాస్తవాన్కి ఆక్షణం వరకూ అతనూ ఆ విషయాల్ని గురించి ఆలోచించనే లేదు ఆకాశంలో ఎగిరే స్వేచ్ఛా విహంగంలాగా అప్పటి వరకూ కోటేశ్రావు జివితాన్ని ఈయాజిటీజ్‌గా తీసుకుని ఈజీగా గడుపు కొచ్చాడు

అంతటితో వదిలిపెట్టక భోజనాలయినాక అతన్ని నిద్ర పోనీయకుండా ఆ రాత్రంతా వూదర గొట్టింది జగదాంబ తన ప్రిన్సిపుల్సుని తీసి తుంగలో తొక్కమంది చెప్పినట్టు వింటే సరి కాదంటే ఎందులోనన్నా దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది చివరికి కాడి క్రిందకి లాగబడిన ఎద్దులాగ తల వంచాడు కోటేశ్రావు!

ఆ మర్నాడే సెలవు పెట్టి రిలీవయి జగదాంబ కోరిక ప్రకారం ఎన మామని కలవటాన్కి అత్తవారి వూరు వెళ్ళాడు కోటేశ్రావు

ఆ మర్నాడే కోటేశ్రావుని వెంట పెట్టుకుని హైదరాబాదు తీసుకు వెళ్ళాడు లంబోదరం

లాడ్జిలో నాలుగు రోజులుండి టాక్సీలో నాల్గు సార్లు వూరమ్మట తిరిగినాక రాజమండ్రి వేస్తారట! అని ప్రకటించాడు లంబోదరం కోటేశ్రావు తల వూపాడు ఆనందంగా అలాగే నన్నట్టు

రాజమండ్రి కూడా ఫర్వాలేదు ఏడాదికి ఒకటి రెండు లకారాలు చూడవచ్చు డబ్బేమయినా తెచ్చావానువ్వు?

ఖర్చులకని రెండు వేలు తెచ్చాను ఒక వెయ్యిమిగిలింది రామ! రామ! కోటేశ్రావు! ఎప్పుడు నేర్చు కుంటావయ్యా ఇంకా నువ్వు? నేనిక్కడే వుంటాను నువు వెంటనే పోయి తల తాకట్టు పెట్టి ఎలాగయినా ఒక ఇరవయి వేలు పట్టుకురా లేపోతే పనికాదు చేతికి అంది వచ్చిన అవకాశం జారిపోతే మళ్ళీరాదు అని తొందర పెట్టాడు లంబోదరం

రాకరాక వచ్చిన ఛాన్సు నిజంగానే పోతుందని భయమేసి స్వంత వూళ్ళో వున్న పొలం ఎకరమూ అయినకాడికి తెగనమ్మి తెచ్చాడు కోటేశ్రావు పన్నరిగింది!

కోటేశ్రావు రాజమండ్రిలో ఛార్జి తీసుకున్నప్పుడు లంబోదరం అతని ప్రక్కనే వున్నాడు అతనికి తెలీని ఎన్నో కొత్త విషయాలు తెలియ జెప్పి నాలుగు రోజులుండి అతను సంసారంతో సెటిలయినాక ఇక నీపని నువు చూసుకోమని చెప్పి హైదరాబాదు వెళ్ళి పోయాడు లంబోదరం

ఒక సంవత్సరం గిర్రున తిరిగే సరికి– కోటేశ్రావుకి ఎన్నో సంగతులు తెలవటంతో పాటు ఖర్చు పెట్టిన పాతిక వేలూ చేతికొచ్చి ఆ పయిన మరో పాతిక వేలు కళ్ళ బడ్డాయి ఇంతకి అంతయితే అంతకి ఎంతా–

అని ఆత్రంగా రెండో సంవత్సరం కోసం కోటేశ్రావు ఎదురు చూస్తున్న తరుణంలో -

హఠాత్తుగా ఒకరోజు ఆఫీసుకొచ్చి ఛార్జీ పుచ్చేసుకున్నాడు పున్నారావు

'నేను వచ్చి సంవత్సరమే గదా అయింది! మూడు సంవత్సరాలు వరకూ నా సీటు ఇదేగదా? అని కోటేశ్రావు అనగా- అదంతా నాకు తెలీదు అని కోటేశ్రావుని రిలీవు చేసేస ఛార్జీ పుచ్చుకున్నాడు పున్నారావు

ఆ మర్నాడే లంబోదరం దగ్గరకి పరుగెత్తి వెళ్ళి మొర పెట్టుకున్న కోటేశ్రావుని ఓదార్చి అపున్నారావా! అతను నాకు తెల్సు అతను వినాయక్రావు గారి కాండిడేటు మన ఎక్స్ పార్టీ మనిషి అన్నాడు లంబోదరం

మరి ఇప్పుడు ఏదిదారి?' అని కోటేశ్రావు మొత్తుకొనగా - చిరునవ్వు నవ్వి - దారివుంది ఏలూరు అయితే నీకు ఎట్లా వుంటుందంటావ్? రాజమండ్రికంటే మంచిప్లేసు అక్కడయితే సంవత్సరాన్కి రెండున్నర లక్షలు చూడవచ్చు పైగా ఇపుడు నీవు పద్ధతికి అలవాటు పడ్డావు గనుక దోకాలేదు!'అన్నాడు లంబోదరం

బాగానే వుంటుంది - అని కోటేశ్రావు ఆశగా అనగా - యాభయివేలు నీవికావనుకో నిమాషాలమీద పని జరిపిస్తాను అని లంబోదరం అనగా వెంటనే వెళ్ళి రాజమండ్రిలో సంపాదించి మూటగట్టిన యాభయివేలూ తెచ్చి అతనిచేత బెట్టాడు కోటేశ్రావు ఏమయితేనేం? పని జరిగింది! ఏలూరులో ఛార్జీ పుచ్చుకొని సంసారంపెట్టిన రోజున లంబోదరాన్కి డిన్నరు ఇచ్చి - మామయ్యా! నీమేలు ఈ జన్మలో మర్చిపోను, అని కృతజ్ఞతలు చెప్పుకున్నాడు కోటేశ్రావు - పట్టుబట్టలుపెట్టి

ఏలూరు అనుకున్నదానికంటే బాగానేవుంది తొమ్మిది నెలలు తిరిగేసర్కి ఖర్చయిన యాభైయివేలూ రాబట్టుకుని ఆపైన మరొక యాభయివేలు గుంజాడు కోటేశ్రావు వెదవపేరు వచ్చినా అదివేరే సంగతి జగదాంబతో కల్సి ఒక శ్రావణ శుక్రవారంనాడు గుడికివెళ్ళి పూజలు జరిపించి నిశ్చింతగా ఆఫీసుకి వెళ్ళేసరికి పున్నారావు ఎదురయాడు కోటేశ్రావుకి

చార్జీ తీసుకోటాన్కి వచ్చాను అన్నాడు నిర్మొహమాటంగా

పున్రావూ! ఇదెక్కడి అన్యాయమయ్యా! నేనెక్కడికి వెళ్ళితే అక్కడికి వేటకుక్కలాగ తరుముకుంటూ రావటమేనా నీ పనీ? ఇదేమైనా న్యాయంగా వుందా? - అని కోటేశ్రావు ఆవేదనగా అనగా-

నేనుమాత్రం ఏంచెయ్యను? నన్ను ఆ ఎచ్చిశ్రావు కాట్లకుక్కలాగా వెంటబడి తరిమి ఆర్డరు తీసుకొనివచ్చి రిలీవుచేసాడు అని చెప్పి కోటేశ్రావుని రిలీవుచేస పారేసాడు పున్నారావు

కోటేశ్రావు - మళ్ళీ లంబోదరం దగ్గరకి వెళ్ళగా - ఓహో! మారుతూ వున్న మనరాష్ట్ర పరిస్థితులే దీనంతటికీ కారణం అయినా పర్వాలేదు మన ప్రయత్నం మనంచేద్దాం నీకు గుంటూరు వేయించనా? అన్నాడు లంబోదరం

కోటేశ్రావు తలవూపగా-

గుంటూరు ఏలూరుకంటే ఇంపార్టెంట్‌పోస్టు లక్షదాకా అవుతుంది, అనగా ఆలక్షా తెచ్చి ఇచ్చాడు కోటేశ్రావు


డబ్బుపోయినా మొత్తానికి ప్రెస్టీజి నిలిచింది అనుకున్నాడు కోటేశ్రావు గుంటూరులో ఛార్జి తీసుకున్న రోజున గుంటూరు బాగానే వుంది

సంవత్సరం గిర్రున తిరిగేసరికి ఖర్చుపెట్టిన లక్షాగాక మరో లక్ష చేతుల్లో పడింది అందుకు ఎంతగానో సంతోషమయింది కోటేశ్రావుకీ జగదాంబకీ

సరిగ్గా ఆ వుగాదినాడు లాడ్జినుండి ఫోను చేసాడు పున్నారావు

ఇవాళే చార్జి తీసుకుంటాను అన్నాడు భయంకరంగా అరిగాడ్డికొడుక అనుకుని పున్నారావ్ ఇదెక్కడి తగులాటకమయ్యా నన్ను కుర్చీలోంచి లేపటమే నీ వుద్యోగమా! నక్షత్రకుడిలాగ నావెంట బడ్డావేమిటీ? దుఃఖంగా గద్గదంగా అన్నాడు కోటేశ్రావు

నేనేం జెయ్యను బ్రదర్! ఆ ఎచ్చిశ్రావు వచ్చి నన్ను రిలీవు చేసాడు అతన్ని రామేశ్రావు లేపేసాడట! రామేశ్రావుని రంగ్రావూ రంగ్రావుని సుబ్రావూ లేపారట నువుగూడా ఎవర్నయినా లేపెయ్యి అని



# ఈ వేమన పద్యాలు




నభమైన నందవచ్చును
ఇబమును పట్టంగవచ్చు నిమిడికె తోడన్
వ్యభిచారి మనసు నిలుపను
ప్రభువులకును సాధ్యపడదు పైకొన వేమా

చెప్పు పండగనయినా చూడకుండా కోటేశ్రావుని రిలీవు చేసేసాడు పున్నారావు నిర్దయగా మరల కోటేశ్రావు హైదరాబాద్ పరుగెత్తి మొత్తుకొనగా – అంత విని లంబోదరం నవ్వాడు ఎం పర్వా లేదన్నట్లు చూసాడు

ఈ మధ్య లంబోదరం బాగా మారాడు స్టేటస్ పెరిగిపోయింది

ముతక ఖద్దరు వదలి ఎల్కు దరిస్తున్నాడు ఆటోలు మానేస టాక్సీలు కావాలంటున్నాడు

## కుర్చీలాట

ఇద్దరు ఆడపిల్లలకీ ఇంజనీర్లనీ డాక్టరు చదువు చదివే కొడుక్కి పెద్ద కంట్రాక్టరుగారి అమ్మాయినీ తెచ్చి పెళ్లిళ్లు చేసాడు ఏకంగా హైదరాబాదుకే మకాం మార్చి స్వంత ఇల్లు కొన్నాడనీ నలుగురూ అనుకోటం

కోటేశ్రావు! ఈసారి ఏనుగు కుంభస్థలాన్నే కొడదాం తెనాలిగాని గుడివాడగాని వేయించమంటావా? అని అడగ్గా–

అలాగే అన్నట్లు తలాడించాడు కోటేశ్రావు

మరి దానికి రెండు లక్షలవుతుంది అని లంబోదరం అనగా ఆ రెండు లక్షలూ తెచ్చి అతనిచేతబెట్టాడు కోటేశ్రావు

మొత్తానికి పని జరిగింది కాని కాకుల్నికొట్టి గ్రద్దలకు వేసినట్లయింది గుడివాడలో గుండూరావుని కుర్చీలోంచి లేపుతూ ఎంతో సంతోషించాడు కోటేశ్రావు మాడిపోయిన గుండురావు మొహంచూసి ఆనందించాడు భగవంతుడి దయవలన ఈ కుర్చీలో ఓ రెండేళ్ల పాటు కూర్చోగలిగితే – పోయిన సొమ్ముని తిరిగి సంపాదించుకోవచ్చు – అని బార్యాపిల్లలతో గుడికి వెళ్లి బారీగా పూజలు చేయించి ఆఫీసుకి వెళ్లాడు కోటేశ్రావు తొలిసారిగా కుర్చీలో గుండూరావు కూర్చుని వున్నాడు గుండులాగా!!

ఇదేమిటి? నాకుర్చీలో మీరు కూర్చున్నారు? లేవండి లేవండి అని కోటేశ్రావు అనగా–

ఆగండి ఆగండి ఈ కుర్చీ నాదే నన్ను మళ్లీ ఇక్కడికివేస్తూ మిమ్మల్ని చింతపల్లి అడవుల్లో గిరిజనుల్ని వుద్ధరించే పోస్టంగు ఇస్తూ రాత్రే లేటెస్టుగా జారీ అయిన ప్రొసీడింగ్సు ఇవిగో సీ టీ సీ మీద మీకు కావాలంటే సంతకంపెట్టి వెళ్లండి పెట్టనన్నా నాకేం పోయింది లేదు అవి గుండూరావు ఆ ప్రొసీడింగ్సు చూపించి కాఫీ తెప్పించి తాగమని రిక్వెస్టు చేయగా – అది తాగిబోల్డు దుఃఖపడి హైదరాబాద్‌కి పరుగుదీసాడు కోటేశ్రావు లంబోదరం దగరకి లబో దిబో మంటూ కోటేశ్రావు తీరా అక్కడికి చేరేసరికి – లంబోదరం ఆక్రితం రాత్రే అర్జంటు పనిమీద డిల్లీ వెళ్లాడని తెలిసింది ఎలాగో నంబరు తెల్సుకుని ఫోనులో పట్టుకుని అతనికి విషయమంతా వివరించగా–

అలాగా! ఆ ఆఫీసరు మన దగ్గర డబ్బు తీసుకుని అవతలి పార్టీ వత్తాడికి లొంగాడన్నమాట! నేను తిరిగి వచ్చాక

మీరు ఎన్నాళ్లలో తిరిగి వస్తారు అని ఆత్రంగా అడగ్గా–

నెలో రెండ్నెల్లో పట్టచ్చు ప్రస్తుతం నేను మనకి ద్రోహం చేసిన ఆ ఆఫీసర్ని నాగాలాండ్ ట్రాన్స్ఫర్ చేయిస్తున్నాను అందువలన

ఇపుడు మరి నన్నేం చేయమంటారు? అని దీనంగా అడిగాడు కోటేశ్రావు ప్రస్తుతానికి ఆ కొత్తచోట చేరిపో మనం తర్వాత తీరిగ్గా మాట్లాడుకుని వుంటాను మినిస్టరుగారి ఎ ఏ కబురు పంపారని మనిషి వచ్చాడు లంబోదరం ఫోను పెట్టేసాడు

బరువయిన గుండెలతో దిగులుగా శూన్యంలోకి చూసాడు కోటేశ్రావు చిన్నతనంలో తను స్కూల్లో ఆడి ఓడిపోయి వుక్రోషంతో ఆపూట తిండిమానేసిన కుర్చీలాట గుర్తుకి వచ్చింది □

ఈ కథ పూర్తిగా కల్పితం ఎవర్నీ వుద్దేశించి రాసిందికాదు –రచయిత